# ప్రాణాధికం

రంగారావూ, అతని బావమరిదీ ఇంటిముందు బయలులో రెండు కుర్చీల మీద కూర్చున్నారు. రంగారావు కనుబొమలు ముడిచి దీర్ఘమైన ఆలోచనలో పడ్డాడు. రామమూర్తి లేచి పచారు చెయ్యటం మొదలుపెట్టేడు. రెండునిమిషాలు గడిచింది. రామమూర్తి అకస్మాత్తుగా రంగారావు ముందాగి "మా చెల్లెలు అంత అధైర్యపడ్డానికి కారణంలేదు" అన్నాడు.

రంగారావు దీనంగా చిరునవ్వు నవ్వేడు.

"ఆ మాట నీ చెల్లెలికి నచ్చచెప్పు చూతాం! ఎవరో గుండె జబ్బుతో పోయినారట. తానుకూడా పోవలసి వస్తుందని ఒకటే బెంగ. పైగా బాధ ఒక్కరవ్వ భరించలేదు. సాధారణంగా నొప్పి భోజనానంతరంకాని, కొంచెం శ్రమపడితే కాని వస్తుంది. ఒక రోజున ఎంత గోలచేసిందనుకున్నావు? నేను చాలా భయపడ్డాను. చివరకు నవ్వి ఎక్కువ బాధలేదన్నది."

రామమూర్తి తల ఊపేడు. "నేనెరుగుదును. దానికి మొండితనం కూడా జాస్తి."

"జాస్తీ గీస్తీ ఎరగనే! డాక్టరును పిలుస్తానన్నాను. డాక్టరు గుండె పరీక్షించాలంటాడని వద్దన్నది. ఏదైనా మందిస్తే తాగుతానంటుంది. కాని నాకు నమ్మకంలేదు సుమా!"

"తాగదు. నేనెరుగుదును."

"ఇంకొక డాక్టరు ఇష్టం లేకపోతే నిన్ను పిలుస్తానన్నాను."

"నన్ను చూస్తే దానికి గురిలేదు. నే నొక వేళ మందిచ్చినా దానికి వంట పట్టదు."

"అమాటే అన్నది. నాకేమీ తోచటం లేదు."

"కాకపోయినా నిన్ను చూస్తే దానికి బొత్తిగా భయంలేదు, బావా! ఎంత అపేక్ష అయినా అంత చనువు పనికిరాదు."

రంగారావు మళ్ళీ నవ్వేడు. "చనువిచ్చినందుకు నాకు పశ్చాత్తాపం లేదు. ఇప్పుడు పశ్చాత్తాపపడీ కార్యంలేదు. దీనికేదో ఉపాయం ఉండాలి. నేనెరిగినంత వరకూ అది మందుపుచ్చుకునే మార్గం కనిపించలేదు. నానాటికి రోగం ఎక్కువవుతూంది."

రామమూర్తి కొంచెం ఆలోచించేడు.

"పోనీ శకుంతలకు ఫలాని డాక్టరు చాలా గట్టివాడని అభిప్రాయం ఉందా?"

"లేకేం? శేషాచలపతి చాలా కేసులు నయం చేశాడు గుండె జబ్బువి. అది దానికి తెలుసును."

రామమూర్తి సంతోషంతో "ఇంకేం?" అన్నాడు.

*　　*　　*

ఆ రాత్రి భోజనాల సమయంలో రంగారావు, భార్య జబ్బు సంగతి ఎత్తేడు.

"అన్నట్టు ఈ ఊళ్ళో గట్టి డాక్టరుండాలే శేషాచలపతిగారని. ఎరుగుదువా? బావా?"

"అవునురా?" అన్నాడు రంగారావు అనుమానిస్తూ.

"ఆయన కొన్ని కేసులు నయం చేశాడు. కాని ఆయన గుండె పరీక్షించ కుండా మందివ్వడు" అన్నది శకుంతల.

"అవును. పరీక్షించనీ. పరీక్షించకుండా ఏ డాక్టరూ ఇవ్వడు!" అన్నాడు రామమూర్తి.

"నాకక్కరలేదు !" అన్నది శకుంతల ఋటూరిస్తూ.

"అదేమేవు?" అన్నాడు అన్నగారు ఆశ్చర్యంతో.

"నాకు పరీక్షలూ వద్దూ పాసలూ వద్దూ."

"వద్దకపోతే జబ్బెలా నయమవుతుంద?"

"పోనీలే! నయం కాకపోతే భయంలేదు."

"బాధపడగలవా?

"ఇప్పుడు పడ్డంలేదూ?"

ఆమెకు సమాధానం చెప్పడం సులభం కాదు.

* * *

ఆ రాత్రి పడుకోబోతూ రంగారావు భార్యను పిలిచేడు. శకుంతల వచ్చి అతని పక్కనే కూర్చుంది. రంగారావు భార్య తల చేత్తో నిమురుతూ "నాకెంత కష్టంగా ఉందో తెలుసునా పిల్లా! అన్నాడు.

"ఎందుకు ?" అన్నది భార్య ఆదుర్దాతో.

"నీకు ప్రాణభయంలేకపోతే మాత్రం నాకోసరం మందు తాగకూడదా?"

శకుంతల మాట్లాడకుండా తల వంచుకుంది.

"పోని నీకిష్టం లేకపోతే" అన్నాడు రంగారావు నిట్టూర్పు విడిచి.

శకుంతల చిరునవ్వుతో తలయెత్తి "నేను మందు తాగుతాను. డాక్టరును నా వెయ్యి అయినా తాకనివ్వను. ఈ ఒక్క విషయంలో నన్ను క్షమించండి" అన్నది.

"ఒకవేళ జబ్బు అపాయకరంగా వచ్చేటట్టయితే నన్ను విడిచిపెట్టి పోతావా?"

"నాకా భయంలేదు. నేను చచ్చిపోయినా మీ దగ్గిరే ఉంటాను !"

"మరి నా విషయం? నిన్ను వదిలి నేనుండగలనా ?"

శకుంతల సమాధానం చెప్పకుండా రంగారావును చప్పున ముద్దు పెట్టుకొని వెళ్ళిపోయింది. రంగారావు ఒక్క నిట్టూర్పు విడిచి ఊరుకున్నాడు, ఏమి జరగాలిసి ఉందో?

* * *

మర్నాడు ఉదయం రామమూర్తి శేషాచలపతిగారితో మాట్లాడి వస్తానని వెళ్ళేడు. రంగారావుకు రామమూర్తి వల్ల లాభంలేదని తోచింది. పది గంటలకు రామమూర్తి సీసాతో మందు తెచ్చేడు.

"శకుంతలా! శేషాచలపతిగారు మందిచ్చేరు. దీనితోనే ఆయన చాలా కేసులు నయం చేశారట. ఇప్పుడొక బొన్సు పుచ్చుకో."

శకుంతల మందుసీసా తీసుకుని "తాగుతాలే" అన్నది.

"ఇప్పుడు తాగు!"

శకుంతల బలవంతంగా గంటసేపు అనుమానించి చివరకు మందు తాగింది.

రామమూర్తి రంగారావు దగ్గిరికి వచ్చేడు.

"ఏమన్నారు చలపతిగారు?" అన్నాడు రంగారావు.

"చలపతిగారూ లేదూ, ఏమీలేదూ" అన్నాడు రామమూర్తి నవ్వి.

"మందు?"

"నాదే."

"పనిచేస్తుందా బాగా?"

"మందు మంచిదేలే. కాని నెలరోజులైనా తాగాలి."

"అంతవరకూ బాధపడుతూంటుందా?"

"పదిహేను ఇరవై రోజులు."

"చచ్చేం!"

"ఆమాత్రం లేకుండానా?"

"నే పదిపడేబాధ చూడలేను సుమా!"

"చూడు. ఈ బలహీనత ఉండరాదు. ప్రతివాడు తప్పనిసరిగా కొంత డాక్టరీ చదవాలని నా అభిప్రాయం. అప్పుడు నువ్విలా అనవు!"

"నీ సంస్కరణ అలా ఉండనీ. అది పడేబాధలో ఒకపాలు నటన. అసైనా లేకుండా చేస్తూ. ఆ నటన, పాఠం, కావాలని కాదు. బొత్తిగా ఓర్చుకో లేదు. ఇలాంటివి చిన్నతనంనుంచీ వస్తాయి."

రామమూర్తి కొంతసేపు ఆలోచించేడు.

"నేను నీకు చేస్తూన్న సహాయానికి సలహాకూ వందరూపాయలు ఫీజు పుచ్చుకోవచ్చును. ఉపాయం చెబుతా వినూ."

*　　　*　　　*

రామమూర్తీ, రంగారావూ భోజనం చేశారు. శకుంతల రామమూర్తి సలహాప్రకారం కొద్దిగా భోజనం చేసింది. మామూలుప్రకారం గుండెలోపోటు సన్నగా ప్రారంభమయింది. రంగారావుకు తాంబూలం ఇచ్చి మరీ అంట్లు శుభ్రంచేద్దామని శకుంతల ఆకులూ, వక్కలూ పట్టుకువచ్చింది.

రంగారావును చూడగానే ఆమె గుండె జల్లుమన్నది. అతను మంచంమీద అటూ ఇటూ పొర్లుతున్నాడు. అతని ముఖం వికారంగా మారిపోయింది.

శకుంతల భయంతో వచ్చి రంగారావు మంచం వక్కనే మోకరించి "ఏమిటి" అన్నది గొంతుచలిస్తూ.

"ఏమీలేదు" అన్నాడు రంగారావు మామూలుగా ఉండాలని ప్రయత్నిస్తూ.

"చెప్పరూ?" అన్నది శకుంతల భర్త చెయ్యి పట్టుకుని.

"గుండెలో బరువుగా ఉన్నది." అన్నాడు రంగారావు బలవంతంగా మాట్లాడుతూ.

"మీకూ్కడానా?"

పదినిమిషాల్లో రంగారావు మామూలు స్థితికి వచ్చేడు. అతను మంచంలో లేచి కూర్చుంటూ "డాక్టరు దగ్గిరికి వెళ్ళివస్తా నిప్పుడే!" అన్నాడు.

"మీరు కాస్సేపు పడుకోండి. మా అన్నయ్య వెళ్ళి వస్తాడు."

"డాక్టరు పరీక్ష చేస్తాడు"

"కొంచెంసేపు ఉండి పోదురుగాని"

ఆ సాయంత్రం రంగారావు సీసాతో మందు తెచ్చుకున్నాడు.

* * *

"నా మందులా లేవే?" అన్నది శకుంతల.

"నా ఊపిరితిత్తులు కూడా సరిగా లేవని ఇంకేదో మందిచ్చేడు. నేనీ మందు తాగలేనుసుమా."

"ఎప్పుడెప్పుడు తాగమన్నాడు డాక్టరు?"

"ఉదయం సాయంత్రం ఆరుగంటలకు"

* * *

ఆరుగంటలకు శకుంతల ఔన్సు గ్లాసులో రంగారావు మందు పోసు కొచ్చింది.

"ఏమిటది?" అన్నాడు రంగారావు అనుమానంతో.

"మీ మందు." "తాగుతాలే" "ఇప్పుడు తాగండి"

"ఈ పూట బాధగా లేదులే. ఈసారి బాధవస్తే తాగుతాలెస్తూ.

"కాదు, నేను కూడా తాగుతానుగా. నన్ను చంపుకున్నట్టే తాగకపోతే." రంగారావు మందు తాగేడు. శకుంతలా తాగింది.

ప్రతిపూటా రంగారావుకు భోజనానంతరము గుండెలో పోటు వస్తూనే ఉంది. శకుంతల అతని బాధతో తన బాధ మరిచిపోతుంది. అతన్ని మందు తాగించటానికి తనుకూడా శ్రద్ధగా మందు తాగుతోంది. రంగారావు ఏ పూటకాపూట చాలా మొండితనం చేసేవాడు. ఇరవై రోజులు గడిచింది,

"నాకీపూట నొప్పి రాలేదు సుమండీ!" అన్నది శకుంతల.

రంగారావు కనుబొమలు ముడేసి గుండెలు రుద్దుతూ "నాకూ ఎక్కువ బాధగా లేదు. ఇక మందు మానేస్తాను" అన్నాడు.

"వద్దు! వద్దు!" క్రమంగా శకుంతల రోగం, రంగారావు దొంగరోగం నయమయినాయి.

* * *

చివరకు రంగారావు నిజం చెప్పేడు.

"అమ్మో! ఎంతవారూ!" అన్నది శకుంతల ఆశ్చర్యం నటిస్తూ. "ఇక మీ మాట ఒక్కటైనా నమ్మను."

"మంచిదే, కాని ఈ పూట తలపగలేస్తున్నది. ఎందుచేతనో?"

"పాపం అమృతాంజనం పట్టుకురానా?"

రంగారావు నవ్వి శకుంతలను రెండు చేతులు పట్టుకొని దగ్గిరికి లాక్కొని "పిచ్చిపిల్లా!" అంటూ ముద్దుపెట్టుకున్నాడు.

(ప్రథమ ముద్రణ : ఏప్రిల్ 1931, గృహలక్ష్మి)